RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే
దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 194
సోమవారం, జూన్ 29, 2026, పేజీలు - 4 వెల : 2/-

మన ఆలోచనల తీరును
బట్టే మనకు ఆనందం
లభిస్తుంది

- ఎమర్సన్

## నల్గొండలో హ్యామ్ రోడ్ల ప్రాజెక్టులకు సీఎం రేవంత్

# శ్రీకారం



**నల్లగొండ, జూన్ 28:** తెలంగాణలో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా కనగల్ ఏఎంసీ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరిం చారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భారీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఎంపీ కుందూరు రఘు వీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, బాలు నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 34 ప్యాకేజీల్లో 6,092 కిలోమీటర్ల మేర 441 రహదారులను హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని ప్రధాన రహ దారుల అనుసంధానం మెరుగుపడటం సహా రవాణా వేగవంతం కానుంది.

## "కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించారు..

# మళ్లీ వాళ్లనస్సలే గెలిపించరు"

### : సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :** పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. నల్గొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాటాడుతూ.. అమరవీరుల త్యాగా లతో వచ్చిన తెలంగాణలో కేసీఆర్ కుటు ంబం మాత్రమే పదవులు అనుభవించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 నెలల్లోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చి, రూ.1.56 లక్షల కోట్ల రైతు రుణాలను అందించి సరికొత్త చరిత్ర సృష్టించిందని చెప్పుకొచ్చారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.పదేళ్ల పాటు అధికార పదవులు అనుభవించి తెలంగాణ రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వందలాది మంది అమరవీరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబమే అనుభవించిందని విమర్శించారు. నల్గొండ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం.. స్థానిక నాగార్జున ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఈ కామెట్లు చేశారు. ముఖ్యంగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, ఫోన్ ట్యాపింగ్ అక్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ విజయాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు.పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే..చేశారు.

## నా పిలుపునకు స్పందించిన మీ

# అందరికీ ధన్యవాదాలు

### : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో తన పిలుపు మేరకు పొదుపు చర్యలు పాటించిన దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. 135వ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బంగారం కొనుగోళ్లను తగ్గించడంతో పాటు ఇతర పొదుపు చర్యలను ప్రజలు చేపట్టారని మోదీ అన్నారు. అనేక మంది తమ విదేశీ టూర్లను వాయిదా వేసుకున్నారని చెప్పారు. ప్రపం చస్థాయి సంక్షోభాన్ని భారతీయులు కలిసి కట్టుగా ఎదుర్కొంటున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే అనేక మైలురాళ్లను చేరుకుందని కూడా ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశీయంగా తయారైన తొలి సీ-295 విమానం కార్యకలాపాలు ప్రారంభం కావడం ఇందుకు నిదర్శనమని అన్నారు.

# 'ఇడుపు కాయితం'

## అర్థం కావాలంటే పవన్ కళ్యాణ్‌ను అడగండి


### : కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ :** సోషల్ మీడియాలో ఇటీవలి కాలంలో బాగా చర్చ జరుగుతున్న అంశం ఇడుపు కాయితం. ఈ సినిమా పేరు బయటకు రాగానే దీనర్థం ఏమిటనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఆ తర్వాత ఇది కాస్తా ఏపీ, తెలంగాణ నెటిజన్ల మధ్య సోషల్ మీడియా వార్‌కు కారణమైంది. ఈ క్రమంలోనే ఇడుపు కాయితం ట్రోలింగ్ గురించి టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పందించారు. ఇడుపు కాయితం అర్థం పవన్ కళ్యాణ్‌కు బాగా తెలుసని.. అర్థం తెలియని వాళ్లు ఆయనను అడిగి తెలుసుకోవాలంటూ ఎద్దేవా చేశారు."ఇడుపు కాయితం" ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా వినిపిస్తున్న పేరు. ఈ పేరుపై వస్తున్న ట్రోల్స్, కామెంట్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇడుపు కాయి తం అంటే అర్థం ఏమిటంటూ జరుగుతున్న ట్రోలింగ్ మీద తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పంది ంచారు. ఇడుపు కాయితం అర్థం తెలియాలంటే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను అడగాలంటూ సెటైర్లు వేశారు. పవన్ కళ్యాణ్‌కు ఇడుపు కాయితం అర్థం బాగా తెలుసని.. ఆయనైతే కరెక్టుగా చెప్తారని ఎద్దేవా చేశారు."ఇడుపు కాయితమంటే ఏందో అర్థమైతలేదంట. దాని మీద ట్రోలింగ్ చేస్తున్నారు. నేను ఒకటే మాట చెప్తున్నా. ఇడుపు కాయితమంటే మాట్లాడుతున్నవారు..

# రైతులకు తీపి కబురు..

## ఈ పంటలు సాగు చేస్తే రైతు భరోసాతో పాటు ఎకరాకు రూ.8 వేల అదనపు సాయం..!



**హైదరాబాద్ :** తెలంగాణలో సుస్థిర వ్యవసాయం, రైతుల ఆదాయ భద్రత కోసం ఆచార్య జయశంకర్ వ్యవసాయ వర్సిటీ సమగ్ర వ్యవసాయ విధానం-2026 నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఐదేళ్లలో 25 లక్షల ఎకరాల్లో వరి స్థానంలో ప్రత్యామ్నాయ పం టలను ప్రోత్సహించాలని, ఇందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే రైతులకు ఎకరానికి రూ.4 నుంచి రూ.8 వేల వరకు నగదు బదిలీ చేయాలని సూచించింది. బలమైన మార్కెటింగ్, ప్రభుత్వ నిధులతో పంటల బీమా, వాల్యూ ఎడిషన్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించిన ఈ నివేదికపై జులై 2న మంత్రిమండలి చర్చించనుంది.తెలంగాణలో సుస్థిర వ్యవసాయాభివృద్ధి, రైతులకు ఆదాయ భద్రత, పటిష్ట గ్రామీణ ఆర్థిక వ్యవస్థే ధ్యేయంగా రూపొందించిన సమగ్ర వ్యవసాయ విధానం-2026 అమలు చేయాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యల నేపథ్యంలో.. అగ్రి వర్సిటీని నోడల్ ఏజన్సీగా ప్ర కటిస్తూ నూతన విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం గత ంలో ఆదేశించింది. దీని ప్రకారం.. వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య నేతృత్వంలోని సుస్థిర వ్యవసాయ, అభివృద్ధి సిద్ధం చేసింది.

## పీవీ తెలంగాణలో పుట్టడం

# మనందరికీ గర్వకారణం

### : కేటీఆర్



**హైదరాబాద్ :** ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు భారతరత్న పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గడ్డు కాలంలో దేశాన్ని భారీ సంక్షోభం నుండి గట్టెక్కించిన నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని అన్నారు. పీవీ జయంతి సందర్భంగా ట్విట్టర్ వేదికగా ఆయనకు ఘన నివాళులర్పించారు.తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ గారి ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహించిందని తెలిపారు. వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టిందని పేర్కొన్నారు.

## ఇరాన్‌పై మరోసారి అమెరికా దాడులు..

## పలు సైనిక కేంద్రాలు ధ్వంసం..



**అమెరికా :** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ అమెరికా మరోసారి వైమానిక దాడులకు దిగింది. ఇరాన్‌లోని పలు సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, యుద్ధ విమానాలతో దాడులు నిర్వహించింది. దీంతో ఆందోళనలు మళ్లీ మొదటికి వచ్చాయి అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇరాన్‌లోని క్షిపణుల నిల్వ కేంద్రాలు, డ్రోన్ స్థావరాలు, రాడార్ వ్యవస్థలు, నిఘా కేంద్రాలు, సముద్ర మార్గాల్లో దాడులకు ఉపయోగించే సైనిక మౌలిక వసతులపై దాడులు జరిగాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మార్గనిర్దేశకత్వంలోనే దాడులు జరిగినట్టు సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపరచడమే తమ లక్ష్యమని పేర్కొంది. ఇటీవల హోర్ముజ్ జలసంధిలోని వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తతలు మళ్లీ మొదలయ్యాయి అమెరికా ప్రయోజనాలు, అంతర్జాతీయ సముద్ర రవాణాకు ముప్పు కలిగించే చర్యలు కొనసాగితే మరింత కఠినమైన సైనిక చర్యలు తప్పవని తాజాగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు కాల్పుల విరమణ ఆరోపించింది.

# ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలి

### : సీఎం చంద్రబాబు




**అమరావతి, జూన్ 28:** ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాం క్షించారు. పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యత తీసుకోవా లన్నారు. పరిస్థితులు మారాయని, సంతానం భారంగా కాకుండా.. సంపదగా మారిందని పేర్కొన్నారు. ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం చిన్నారుల తల్లిద ండ్రులు, కుటుంబసభ్యులతో మాట్లాడారు.పిల్లలను ఎత్తుకుని కొంతసేపు ఆడించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పిల్లల పెంపకం భారంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగానికి, ఉపాధికి వెళుతున్న మహిళలు.. పిల్లల పెంపకాన్ని ఎలా సమన్వయం చేసుకుంటున్నారని అడిగారు. ఇంట్లో భర్త, మగవాళ్లు కూడా పిల్లల పెంపకంలో బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు.పిల్లల్ని కని, పెంచడం, వారి ఆలనాపాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదని చెప్పారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉంటే పిల్లల పెంపకంలో భాగస్వాములు అయ్యేవారని అన్నారు. పిల్ల లను విలువలతో పెంచడంలో నాడు అమ్మమ్మలు, తాత య్యలు, ఇతర కుటుంబసభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, అలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మళ్లీ రావాలని కోరారు. ఇద్దరు.. అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వ పరంగా కూడా ప్రోత్సహిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు.

# కొల్చారం మండలంలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం






**కొల్చారం జూన్ 28 మెదక్ టుడే న్యూస్:**
మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాఎజ) పరిధిలో ఆదివారం నాడు పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు ఆరోగ్య కేంద్ర పరిధిలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు 2856 మంది ఉన్నారు.మొదటి రోజు వేసిన చుక్కలు ఆదివారం ఒక్కరోజే 2806 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.మండల వ్యాప్తంగా మొత్తము 10 బూత్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ప్రత్యేక కేం ప్రయాణికు లలోని పిల్లల కోసం పోతనశెట్టిపల్లి వద్ద ఒక ట్రాన్సిట్ పాయింట్ మరియు ఒక మొబైల్ టీంను కూడా అందుబాటులో ఉంచారు.ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల కోసం సోమవారం, మంగళవారం రోజుల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ (గృహ సందర్శన) వెళ్లి చుక్కలు వేయనున్నారు. అదేవిధంగా, హైరిస్క్ (వలస కార్మికులు, ఇటుక బట్టీలు, తోటలు ఉన్న) ప్రాంతాలలో మొబైల్ టీమ్ ద్వారా పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు అందిస్తామని ఆరోగ్య కేంద్ర అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# చేగుంట గ్రామపంచాయతీలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం:

**చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సర్పంచ్ సండ్రగు ప్రవంతి సతీష్**
**ప్రతిసారి రెండు చుక్కలు - పోలియోపై నిరంతరంగా విజయం"**




**చేగుంట, జూన్ 28 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేగుంట పట్టణ సర్పంచ్ సండ్రగు స్రవంతి సతీష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, చిన్నారులకు తమ చేతుల మీదుగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా తమ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. "ప్రతిసారి రెండు చుక్కలు – పోలియోపై నిరంతరంగా విజయం" అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు తమ పిల్లలతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాయిని జలాల్‌పూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం:

**- పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం**
**- 'మెదక్ లైఫ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' సౌజన్యంతో ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ**






**కొల్చారం జూన్ 28 ( మెదక్ టుడే న్యూస్ ):**
కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్ గ్రామంలో ఆదివారం నాడు ఉచిత మెగా వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. మెదక్ లైఫ్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో, నాయిని జలాల్‌పూర్ గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఉచిత పరీక్షలు – మందుల పంపిణీ:
ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు రూపాయి ఖర్చు లేకుండా కింది పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు: ఈసీజీ (జుజ+) పరీక్షలురక్తపోటు (బీపీ) మరియు షుగర్ పరీక్షలుఇతర అవసరమైన కీలక రక్త పరీక్షలువైద్యులు రోగులను క్షుణ్ణంగా పరీక్షించి, వారి ఆరోగ్య సమస్యలకు తగిన సూచనలు చేస్తూ ఉచితంగా మందులను పంపిణీ చేశారు.
సేవా సంకల్పంతోనే శిబిరం: హాస్పిటల్ ఎండీ నదీమ్, మన్సూర్ "సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించడం సంతోషంగా ఉంది."
--- నదీమ్ (హాస్పిటల్ ఎండీ), మహమ్మద్ మన్సూర్
పాల్గొన్న ప్రముఖ వైద్య బృందం:
ఈ మెగా శిబిరంలో లైఫ్ కేర్ మెదక్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయిని జలాల్‌పూర్ గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# నిండు జీవితానికి రెండు చుక్కలు సర్పంచ్ సాయికుమార్ గౌడ్



**చేగుంట జూన్ 28 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం వడియారం గ్రామపంచాయతీ కార్యాల యం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమా నికి వడియారం గ్రామ సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ముఖ్య అతిథి విచ్చేసి అక్కడ ఉన్న పిల్లలకు తమ చేతుల మీదుగా పోలియో చుక్కలు వేసినారు అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలను ప్రాణాంతకమైన శాశ్వత పక్షవాతాన్ని కలిగించే పోలియో వ్యాధి నుండి రక్షించడానికి,వారి భవిష్యత్తును ఆరోగ్యంగా ఉంచడానికి పోలియో చుక్కలు వేస్తారు. పోలియో వైరస్‌కు నిర్దిష్టమైన చికిత్స లేదు కాబట్టి, చిన్న వయస్సులోనే టీకా వేయించడం ద్వారా మాత్రమే ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు.పోలియో వైరస్ సోకితే పిల్లలు శాశ్వత పక్షవాతానికి గురయ్యే అవకాశం ఉంది. వ్యాక్సిన్ వేయించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి ఈ ప్రమాదం తప్పుతుంది చిన్న వయసులో క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించడం వల్ల పిల్లలకు దీర్ఘకాలిక రోగనిరోధక శక్తి లభిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంకన్న గారి సాయికుమార్ గౌడ్, ఉప సర్పంచ్ బండారి నాగరాజు, పాలకవర్గ సభ్య లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# అమీన్‌పూర్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్





**అమీన్‌పూర్, జూన్ 28:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని 271వ డివిజన్, శ్రీ వాణినగర్ సొసైటీ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం ఆదివారం కొనసాగింది. 159, 160, 161 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈ ప్రక్రియను జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ జిహెచ్ఎంసి కమిషనర్ నర్సింహా స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ) మరియు బూత్ స్థాయి ఏజెంట్లకు (బి ఎల్ ఏ) ఓటరు నమోదు, సవరణల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, ఓటరు జాబితా నమోదులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కోరారు. రాబోయే నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అధికారులు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలను నమోదు చేయించుకోవడంతో పాటు.. చిరునామా మార్పులు, పేర్లలో తప్పులు వంటివి ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. అలాగే, బూత్ స్థాయి అధికారులు మరియు బూత్ స్థాయి ఏజెంట్లకు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కారుపోతుల మహేష్ గౌడ్, శ్రీ వాణినగర్ సొసైటీ అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి నర్సింగరావు, ఉపాధ్యక్షుడు సుమన్ గౌడ్, ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చామకూరి వెంకన్న గౌడ్, శ్రీనివాస్ గుప్తా, రమణారెడ్డి మరియు బి.ఎల్.ఏలు చరణ్ రాజ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# హిట్ అండ్ రన్ కంటైనర్‌ను వెంబడించి పట్టుకున్న యువకులు

**- రిపోర్టర్ చిక్కుడు మహేష్, బోయిని రాజులకు ఎస్సై ఘన సన్మానం**




**?చేగుంట జూన్ 28 మెదక్ టుడే న్యూస్**
చేగుంట జాతీయ రహదారి (ఎన్ ఎచ్ 44) పై శనివారం మధ్యాహ్నం కర్నే మంజుల అనే మహిళను ఢీకొట్టి ఆపకుండా అతివేగంగా పారిపోతున్న కంటైనర్ లారీని తమ ప్రాణాలకు తెగించి వెంబడించి పట్టుకున్న రిపోర్టర్ చిక్కుడు మహేష్, బోయిని రాజుల ధైర్యసాహసాలను చేగుంట పోలీసులు అభినందించారు. ప్రమాదం జరిగిన వెంటనే కంటైనర్ ఆపకుండా వెళ్ళిపోతుండగా,అటుగా వెళ్తున్న చిక్కుడు మహేష్, బోయిని రాజులు సమయస్ఫూర్తితో స్పందించి తమ ద్విచక్ర వాహనంపై ఆ వాహనాన్ని చాకచక్యంగా వెంబడించారు. లారీని అడ్డుకొని డ్రైవర్‌ను పట్టుకున్న యువకులు,వెంటనే పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆదివారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్సై జి. చైతన్య కుమార్ రెడ్డి సదరు యువకుల సాహసాన్ని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. సమాజంలో ప్రమాదాలు జరిగినప్పుడు ఇలాంటి ధైర్యవంతులైన యువకుల ఆవశ్యకత ఎంతైనా ఉందని కొనియాడుతూ ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి వారిద్దరినీ శాలువాతో ఘనంగా సన్మానించార. ఈ కార్యక్రమంలో చేగుంట పోలీస్ సిబ్బంది, మీడియా మిత్రులు మొజమిల్, కొండి శ్రీనివాస్, మధు, చౌదరి శ్రీనివాస్, స్టాలిన్ నర్సింలు, శబ్బని

# మాతను దర్శించుకున్న మండల గౌడ సంఘం అధ్యక్షులు వెంకట్ గౌడ్





**(కొల్చారం ) జూన్ 28 మెదక్ టుడే న్యూస్:**
రేణుకా మాతా కటాక్షం తో ప్రజలందరూ చల్లగా ఉండాలని మండల గౌడ సంఘం అధ్యక్షులు అప్పాజీ పల్లి సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ ( గజినీ ) అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు.మండల పరిధిలోని అంసానిపల్లి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయం లో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి అమ్మ వారి ఆశీస్సులు తీసుకున్నారు.
ఆలయ పురహితులు కిరణ్ కుమార్ శర్మ వేద మంత్రముల మధ్య ఉదయం లంద పూజ జోగు అడుగుట అనంతరం సాయంత్రం పోచమ్మకు బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మండల గౌడ సంఘం అధ్యక్షుని తో పాటు మాజీ సర్పంచ్ శ్రీధర్ గౌడ్, జర్నలిస్ట్ లు రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్ లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలోగంగాపురం నర్సాగౌడ్, వెంకట్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, యాదగిరి గౌడ్, రామాగౌడ్, సత్త గౌడ్, రవీందర్ గౌడ్, చంద్రం గౌడ్, శ్రీశైలం గౌడ్, రామస్వామి గౌడ్, కిష్టగౌడ్,యాదగిరి గౌడ్, సత్యనారాయణ గౌడ్,ముఖ్య నాయకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## జిల్లా పరిధిలో ఉత్తమ జోన్ చైర్మన్ గా అవార్డ్ ను అందుకున్న ఆకుల సుఖేందర్



**చేగుంట జూన్ 28 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం చేగుంట గ్రామానికి చెందిన ఆకుల సుఖేందర్ ది లయన్స్ ఇంటర్నేషనల్ 320 డీ జిల్లా పరిధిలో అవర్స్ కార్యక్రమం ఆదివారం కొంపల్లిలోని నిమ్మల గార్డెన్ లో సాయంత్రం జిల్లా గవర్నర్ లయన్ అమర్నాథ్ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సిద్దిపేట రీజియన్ పరిధిలో జోన్ చైర్మన్ గా 2025 మరియు 2026 కు గాను ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఉత్తమ జోన్ చైర్మన్ అవార్డును గవర్నర్ చేతుల మీదుగా ఆకుల సుఖేందర్ అందుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో గవర్నర్ అమర్నాథ్,సెకండ్ గవర్నర్ విజయలక్ష్మి,చేగుంట లయన్స్ శ్రీనివాస్,రామచందర్, నాగరాజు, నర్సింహారెడ్డి,సంజీవ్, సిద్ధిరములు,మనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకున్న మెదక్ జిల్లా ఎస్పీ



**మెదక్,జూన్,28,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)** ఆదివారం మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్, కుటుంబ సమేతంగా మెదక్ జిల్లా నాగసానిపల్లి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల శ్రీ వనదుర్గామాత ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మెదక్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, మెదక్ జిల్లా శాంతిభద్రతలు మరింత బలోపేతం కావాలని ప్రార్థించారు. ఆలయ అర్చకులు ఎస్పీ దంపతులకు వేద ఆశీర్వచనం అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్,జూన్,28,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడం అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం శివంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలే రక్షణ కవచమని అన్నారు. జిల్లాలోని ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి పల్స్ పోలియోకార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించా లన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేగుంట మండలం లో మట్టి మాఫియా!



**చేగుంట జూన్ 28 మెదక్ టుడే న్యూస్**చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామం లో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వఆస్తులను, ప్రకృతి మూలాలను కొల్లగొడుతూ వేల లక్షల విలువైన సహజ సంపదను,అక్రమార్కులు స్వాహా చేస్తున్నారు. పెద్ద శివనూర్ గ్రామం లోని ఊర చెరువు నుండి గత 10 రోజుల నుండి కొంతమంది స్వార్థపరులు, ప్రభుత్వ కాలువను పుడ్చివేసి,ప్రైవేట్ భూమి వరకు, భారీగా అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా సాగిస్తూ ఇష్టారాజ్యంగావ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయనే అబద్ధపు ప్రచారంతో రోజుకు వందలాది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ, లక్షల రూపాయల ప్రభుత్వఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ అక్రమ దందాపై స్థానిక శ్రేణులు తిరగబడటంతో మట్టి మాఫియా బాగోతం బట్టబయలైంది.

# రక్తదాన శిబిరంలో పాల్గొన్న 100 మందికి పైగా దాతలు: ఘనంగా ముగిసిన శిబిరం






**పటాన్‌చెరు, జూన్ 28:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ పి.వి. నరసింహారావు గారి 105వ జయంతి సందర్భంగా, బీరంగూడలోని 'ప్రణీత్ ప్రణవ్ నైట్‌వుడ్స్' ప్రాంగణంలో రక్తదాన శిబిరం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కుమార్ కామరాజు మరియు శ్రీ పి.వి. నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 80 నుండి 100 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ గొప్పతనాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా 'ప్రణీత్ ప్రణవ్ నైట్‌వుడ్స్' అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా లభించిన రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చైర్మన్ రెడ్డేశ్వర్ కుమార్ మాట్లాడుతూ, "సమాజ హితం కోసం పాటుపడే శ్రీ పి.వి. నరసింహారావు గారి ఆశయాలకు అనుగుణంగా, చారిట బుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం. వారి ట్రస్ట్‌తో కలిసి మా ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించడం మాకు గర్వకారణం. ముఖ్యంగా ప్రణీత్ గ్రూప్ సంస్థ ఎప్పుడూ ఇటువంటి సామాజిక బాధ్యతాయుతమైన కార్యక్రమాలకు అండగా నిలుస్తోంది. ఇక్కడకు విచ్చేసి, ప్రాణాలను రక్షించే ఉద్దేశంతో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్క దాతకు, మరియు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరి ంచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో భాగంగా చైర్మన్ రెడ్డేశ్వర్ కుమార్, వైస్ చైర్మన్ ఉదయ్ సత్రశాల, జనరల్ సెక్రటరీ ప్రదీప్, జాయింట్ సెక్రటరీ పెద్దిరెడ్డి, ట్రెజరర్ ప్రభాకర్, మరియు కమిటీ సభ్యులు హరి వంశ్యరాజు, ధనిష్ట, దీపక్, రాజేష్, పవన్, యశ్వంత్ తదితరులు పర్యవేక్షించారు.

## ఆరోగ్యవంతమైన బాల్యానికి పోలియో చుక్కలే రక్షణ: తెలంగాణ రక్షణ సేన పటాన్‌చెరు ఇంచార్జ్ తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి





**పటాన్‌చెరు, జూన్ 28:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మరియు పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రక్షణ సేన పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా తుమ్మల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... "ప్రతి చిన్నారి ఆరోగ్యవంతంగా పెరగాలని, భవిష్యత్తులో ఎలాంటి అంగవైకల్యాలు దరిచేరకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత అవకాశాన్ని తల్లిదండ్రులు బాధ్యతగా భావించి, ఐదేళ్లలోపు ఉన్న తమ పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి" అని కోరారు. పోలియోను పూర్తిగా నిర్మూలించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం మనందరి సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరంగా ఉండకూడదని, ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించి, తమ పిల్లల భవిష్యత్తుకు భరోసానివ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, తెలంగాణ రక్షణ సేన నాయకులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి 21వ బ్రహ్మోత్సవాలు

**- 108 కళాశాలతో అమ్మవారి ఊరేగింపు**





**చేగుంట జూన్ 28 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి 21వ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈరోజు స్థానిక హనుమాన్ దేవాలయం నుంచి వాసవి మాత దేవాలయం వరకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 108 కళాశాలతో అమ్మవారిని భారీగా ఊరేగింపు నిర్వహించి దేవాలయంలో అమ్మవారికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలను అమ్మవారి అభిషేకంతో ప్రారంభమై సామూహిక కుంకుమార్చన, ఒడి బియ్యం, అమ్మవారికి అష్టోత్తర శత వస్త్ర సమర్పణ నిట్టల కిరణ్మయి హైదరాబాద్ చే ప్రవచనము, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి మన్య సూక్తి అభిషేకము, వడమాల అలంకరణ,తమలపాకుల అలంకరణ,తదితర కార్యక్రమాలు ఈరోజు నుండి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## అమీన్‌పూర్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కాట సునీత రాజేష్ గౌడ్



**అమీన్‌పూర్, జూన్ 28:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ డివిజన్‌కు చెందిన లింగమయ్య కాలనీ మరియు ఎన్ఎస్ఎల్ కాలనీలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కాట సునీత రాజేష్ గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా నేడు ఆయా కాలనీలలో పర్యటించి, స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో పరిశీలన.. ప్రజల నుంచి ఆవేదన:కాలనీలలో పర్యటించిన ఆమె, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పరిస్థితి, వీధి దీపాల నిర్వహణ మరియు పారిశుద్ధ్య పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన.. ప్రజల నుంచి ఆవేదన:కాలనీలలో పర్యటించిన ఆమె, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పరిస్థితి, వీధి దీపాల నిర్వహణ మరియు పారిశుద్ధ్య పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తాను: కాట సునీత రాజేష్ గౌడ్ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీమతి కాట సునీత రాజేష్ గౌడ్ మాట్లాడుతూ.. "ప్రజలతోనే ఉంటూ, ప్రజల కోసం నిరంతరం పనిచేయడమే నా ప్రధాన లక్ష్యం. కాలనీలలో ఉన్న సమస్యల పట్ల నేను స్వయంగా అవగాహన చేసుకున్నాను. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల విషయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, త్వరితగతిన సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తాను. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం మా బాధ్యత" అని స్పష్టం చేశారు. అధికారులు స్పందించకుంటే ప్రజా ఉద్యమాలు చేస్తామని, కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక కాలనీ ప్రతినిధులు, ఆంజనేయులు, బీఆర్ఎస్ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం అమలుపై ప్రశ్నలు

**- వేరే స్టాప్ పేరుతో టికెట్ జారీ చేశారంటూ మహిళ ఆరోపణ**

**- విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి**






**(స్పెషల్ కరస్పాండెంట్)రాజేంద్రనగర్,జూన్,28,మెదక్ టుడే న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో కొందరు కండక్టర్లు ప్రయాణికులు ఎక్కిన స్టాప్‌కు బదులుగా వేరే స్టాప్ పేరుతో టికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరహా ఘటనలు పథకం పారదర్శకతపై సందేహాలకు తావిస్తున్నాయని కొందరు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.తాజాగా స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సీసీ కెమెరా టెక్నీషియన్ కోర్సు అభ్యసిస్తున్న సౌమ్య అనే మహిళ శనివారం ఆరంగర్ వద్ద బస్సు ఎక్కి మదనపల్లి వద్ద దిగాలని భావించారు. అయితే అక్కడ బస్సు ఆగదని కండక్టర్ చెప్పడంతో, ఆరంగర్ నుంచి శంషాబాద్ వరకు టికెట్ జారీ చేయాలని ఆమె కోరినట్లు తెలిపింది.అయితే, తనకు శివరాంపల్లి నుంచి కిషన్‌గూడ వరకు టికెట్ జారీ చేశారని సౌమ్య ఆరోపించారు. దీనిపై ఆమె కండక్టర్‌ను ప్రశ్నిస్తూ, "నేను శివరాంపల్లిలో బస్సు ఎక్కలేదు. ఆ స్టాప్ నుంచి టికెట్ ఎందుకు ఇచ్చారు? శివరాంపల్లి నుంచి బస్సు బయలుదేరిన సమయం, నాకు ఇచ్చిన టికెట్‌పై ఉన్న సమయం సరిపోలడం లేదు" అని నిలదీసినట్లు తెలిపారు.దీనికి కండక్టర్, "మేము ఇలాగే టికెట్లు ఇస్తాం. ఎవరికి చెప్పుకోవాలో చెప్పుకోండి. ఫోటోలు, వీడియోలు తీయాలనుకుంటే తీసుకోండి" అని స్పందించినట్లు ఆమె పేర్కొన్నారు.ఈ ఘటనపై సౌమ్య మాట్లాడుతూ, మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ప్రయాణ పథకం లక్ష్యానికి భంగం కలిగించేలా ఎక్కడైనా అవకతవకలు జరుగుతున్నట్లయితే వాటిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులు ఎక్కిన ప్రదేశానికి బదులుగా వేరే స్టాప్ పేరుతో టికెట్లు జారీ చేయడానికి కారణాలేమిటో వెల్లడించి, వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని కోరారు.అలాగే టార్గెట్ల పేరుతో లేదా ఇతర కారణాలతో టికెట్ జారీ విధానంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వార్తలు రాసేవారు - ప్రసారాలు చేసేవారు జర్నలిస్టులే

**- సుప్రీం కోర్ట్ కీలక వ్యాఖ్యలు**



ఇకపై కావాలనే కక్ష్యతో రాజకీయ నాయకులు, అక్రమ సంపాదన దందాలు చేసే వారు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్టులపై అక్రమ కేసులు చెల్లనేరవు:సుప్రీం కోర్ట్ శాటిలైట్ ఛానెల్స్, యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్, ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసులా లేక నిజ నిరూపణ కేసులా అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని, వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై, అట్టి పోలీసులపై వేట తప్పదు:సుప్రీం కోర్ట్.

# పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్‌చెరు, జూన్ 28: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** దేశవ్యాప్తంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా, ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు చిన్నారులకు పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, "నిండు జీవితానికి రెండు చుక్కలు" ఎంతో కీలకమని, ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి విధిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. దేశాన్ని పోలియో రహిత దేశంగా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి, తమ పిల్లలకు చుక్కలు వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు బిక్షపతి, పృథ్వీరాజ్, అశోక్, వెంకటేష్, షకీల్, స్థానిక వైద్య సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత.

**- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి.**



**బెల్లంపల్లి: జూన్ 29.** ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లి తండ్రుల బాధ్యతనీ, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు.జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తాలో, బూడిదిగడ్డ బస్తీలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పోలియో వ్యాధి అనేక కుటుంబాల్లో విషాదాన్ని నింపేదని, ప్రభుత్వాలు చేపట్టిన నిరంతర పల్స్ పోలియో కార్యక్రమాల ఫలితంగా, నేడు దేశం పోలియో నిర్మూలన దిశగా విజయవంతంగా ముందుకు సాగుతోందని అన్నారు.ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలనీ, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ సేవను ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలనీ విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యవంతమైన పోలియో రహిత తెలంగాణ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిల్లుట్ల గ్రామంలో బి.ఆర్. అంబేడ్కర్ ఆవిష్కరణ.



**మెదక్ జిల్లా,జూన్,28,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)** పిల్లుట్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఈ విగ్రహం సమానత్వానికి ప్రతీక. సామాజిక న్యాయానికి చిహ్నం. ప్రతి పేద కుటుంబానికి ఆశాజ్యోతి. ప్రతి యువకుడికి స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ జీవితం -- మనందరికీ ఆదర్శమన్నారు.చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొన్నారు.చదువుతో ప్రపంచాన్ని గెలిచారన్నారు. వారు మనకు చెప్పిన గొప్ప సందేశం ఒక్కటే.పుట్టుక మన చేతిలో ఉండదు.కానీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మన చేతిలోనే ఉంటుందన్నారు.బాబాసాహెబ్ డా. బి ఆర్ అంబేద్కర్ బహుభాషావేత్త. ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర అన్నింటిలో నిష్ణాతుడు. అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేశారు.అంబేద్కర్ తన కోసం జీవించలేదు. సమాజం కోసం జీవించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించారు. గౌరవంగా జీవించడం ప్రతి మనిషి హక్కు" అని ఆయన మనకు నేర్పించారు. మన దేశానికి బీ.ఆర్ అంబేద్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగం. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవితం అందించిందన్నారు అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పి గా పిలుస్తామన్నారు. బాబాసాహెబ్ చెప్పిన మార్గంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవ గౌరవం కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం. మన యువత.బాబాసాహెబ్ జీవితాన్ని చదవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. విద్యను ఆయుధంగా మార్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇంచార్జి రాజిరెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణల ఆద్యుడు పీవీ నరసింహారావు చిరస్మరణీయుడు: పోచంపల్లి రమణారావు



**జూన్ 28 | | హైదరాబాద్** భారత ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, బహుభాషా కోవిదుడు, భారతరత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు.పీవీ నరసింహారావు 105వ జయంతి సందర్భంగా ఆదివారం ఎల్‌బీనగర్ పరిధిలోని అల్కాపురి కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ, పీవీ నరసింహారావు దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాదులు వేసిన మహానేత అని కొనియాడారు. వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టడం, నెక్లెస్ రోడ్డుకు 'పీవీ మార్గ్'గా నామకరణం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పీవీ నరసింహారావు పేరుతో ఒక జిల్లాను ప్రకటించాలని, అలాగే ఆయన చిరస్మరణీయ సేవలకు గుర్తింపుగా ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శ్యాంసుందరరావు, ప్రచార కార్యదర్శి గూడ జయరాం, నరసింహారావు, మామిడాల మధుకర్‌రావు, సీనియర్ జర్నలిస్ట్ అక్కినేపల్లి పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

**- పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**






**మెదక్,జూన్,28,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)** ప్రతి ఐదేళ్ల లోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని,జాతీయ ఆరోగ్య మిషన్ కింద పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం, మెదక్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు.ఈ సందర్భంగా 5 సంవత్సరాల లోపు చిన్నారులకు స్వయంగా కలెక్టర్ పోలియో చుక్కలు వేశారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,పోలియో రహిత సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమైందన్నారు. ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబం తమ చిన్నారులను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు సురక్షితమైనవి, అత్యంత ప్రభావవంతమైనవని తెలిపారు.జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలియో కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేంద్రాలకు రాలేని చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి చిన్నారి పోలియో చుక్కలు తీసుకునే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ గణేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఇతర సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జా యత్నం.. ప్రకృతి విధ్వంసంపై చర్యలు తీసుకోవాలి:తీర్థాల కొమురెల్లి డిమాండ్

**మంథని.**ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెవెన్యూ శివారులో ఉన్న 617 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఎర్రమట్టిని తరలించి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తీర్థాల కొమురెల్లి ఆరోపించారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టను తవ్వి ఎర్రమట్టిని తరలిస్తున్నారని తెలిపారు. అనంతరం అదే మట్టిని ప్రభుత్వ భూమిలో డంపింగ్ చేసి గుట్టను చదును చేస్తూ ఆక్రమణకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించకుండా ప్రకృతి సంపదను దోపిడీ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆయన విమర్శించారు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని విక్రయిస్తూ అక్రమంగా వేలాది రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు.అదేవిధంగా, గ్రామపంచాయతీ పరిధిలోని మానేరు నుంచి కూడా అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని తెలిపారు.ఈ అక్రమాలపై రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు శాఖ, జిల్లా పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తీర్థాల కొమురెల్లి డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములు, పర్యావరణం, ప్రకృతి సంపదను పరిరక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..